


నేనీ యింట్లో చేరి యివాళ్టికి రెండు సంవత్సరా లయింది. ఈ యింట్లో నేను కసువు వూడుస్తున్నాను; అంట్లు తోముతున్నాను. తీరిక సమయాల్లో పిల్లలను యెత్తుకుని ఆడిస్తున్నాను. నీళ్ళు కాయటం, మొదలైనవన్నీ నేనే చేస్తున్నాను. మా యజమానురాలు పనిమీద ఉంటే కూరలు మొదలైనవన్నీ నేనే కోస్తూంటాను. నిజం చెప్పాలంటే ఈ యింట్లో నేను చెయ్యని పని అంటూ లేదు.

నేను పని బాగా చెయ్యగలిగిందాన్నే. ఏదన్నా ఎక్కువపని చెప్పినా, "మొదట్లో ఈ పని మనం అనుకోలేదు" అని అనే దాన్ని కాదు; అనుకునేదాన్నికూడా కాదు. మిగిలిన పనులు చేసినట్లే చేసేదాన్ని. నాకు ఈ పనులన్నీ చేసి, బట్టలు ఉతికినందుకు ప్రొద్దున అన్నంపెట్టి ఎనిమిది రూపాయలు యిచ్చేవాళ్ళు. సరిగ్గా నేను పనిలోకి ప్రొద్దున్నే ఏడుగంటలకల్లా వెళ్ళేదాన్ని. పనిపాటలు అన్నీ పూర్తి అయింతర్వాత పిల్లల్ని యెత్తుకు తిప్పేదాన్ని. పదిగంటలకు అయ్య భోజనం చేసి, ఆఫీసుకు వెళ్ళేవారు. పిల్లలందరూ అదే టైమ్‌కు భోజనాలు చేసుకుని స్కూళ్ళకు వెళ్ళేవాళ్ళు. ఇంక చంటి పిల్లలు యిద్దరు మిగిలేవాళ్ళు. అయ్య వెళ్ళిన తర్వాత నేనే చంటిపిల్లలను ఇద్దర్నీ పెట్టుకు కూచుంటే అమ్మ అప్పుడు స్నానంచేసి, ఉతికినబట్టలు కట్టుకుని భోజనానికి కూర్చునేది. ఆమె భోజనం ముగించివచ్చి నన్ను అన్నం తినమనే వరకూ, రోజూ పదిగంటలయ్యేది. నాకు మొదట్లో కష్టం అనిపించేది కాదు. కాకపోతే తొమ్మిదిగంటలయ్యాం దగ్గరనుంచి ఆకలయ్యేది. అయితేనేం? ఆకలి అవగానే యేదో వొకటి తినాలనిపించేది కాదు. ఆకలి అయితే అవుతుంది అంతే. అది యెప్పుడూ అవుతూనే ఉంటుంది. కాకపోతే కాళ్ళు ముడుచుకొని కూర్చుంటే సరిపోయేది.

నా కళ్ళముందు నాకు ఆకలి అయ్యేటప్పుడు వాళ్ళు చిరుతిండ్లు తింటున్నా, నాకు తినాలనిపించేది కాదు. కానీ కాలం గడిచినకొద్దీ నా బుద్ధి మారింది. వాళ్ళు చిరుతిండు తిన్నప్పుడల్లా నాకూ తినబుద్ధి అయ్యేది. ఈ మార్పుకు కారణం ఏమిటో, ఎందుకొచ్చిందో! నేను చెప్పలేను.

నేను ఈ యింట్లో పనిచేసుకుని నా యింటికి వెళ్ళేప్పటికి, ఎప్పుడూ రాత్రి ఎనిమిదిగంటలకు తక్కువ అయ్యేది కాదు. నేను వెళ్ళేటప్పటికి మా అమ్మ యింకా వచ్చేదికాదు. మా అమ్మ వొక పెద్దయింట్లో పనిచేస్తూ వుండేది. రాత్రుళ్లు వాళ్ళు అన్నాలు పూర్తి అయ్యేటప్పటికి యే పదిగంటలో అయ్యేది. అప్పుడు వాళ్ళు తినగా మిగిలిన అన్నం పట్టుకుని మా అమ్మ వచ్చేది. ఈలోగా నేనే కుండలు కడిగి అన్నం వండేదాన్ని. గొడ్డుకారం వేసుకుని యింత తిని పడుకునేదాన్ని. ఒక్కొక్కప్పుడు నిద్ర ఆపుకోలేక, వొచ్చినదాన్ని వచ్చినట్లే పడి నిద్రపోయేదాన్ని. మా అమ్మ పని ముగించుకుని వచ్చి, అక్కడ మిగిలిన అన్నం యేమన్నా వుంటే నన్ను లేపి రెండు ముద్దలు తినిపించేది; లేకపోతే లేదు. తనూ నా ప్రక్కనే చెంగు పరుచుకొని పడుకుని నిద్రపోయేది.

తెల్లవారి ఐదుగంటలకు లేచి, నన్ను లేపి, తను పనిలోకి వెళ్ళేది. నేను యిల్లు వూడ్చి, కుండలు కడిగి, ఏడు గంటలకల్లా నే పనిచేస్తున్న యింటికి వెళ్ళేదాన్ని. ఎప్పుడన్నా మా అమ్మ లేపినప్పుడు లేచి, మా అమ్మను బయటకు వెళ్ళనిచ్చి, మళ్ళా పడుకుని నిద్రపోయేదాన్ని. ఏ ఎనిమిది గంటలకో నిద్ర మెలుకువ వచ్చేది. గుండె గుభేలుమనేది. అదరాబాదరా పనిలోకి వెళ్ళేదాన్ని. ఇక యజమానురాలికి ఏం చెప్పి ఏం లాభం? "తెల్లవారి లేవగానే నరాలు ఒకేపెట్టున లాగినై. లేవలేకపోయాను" అని చెప్తే ఆమె వింటుందా? "నేను నిద్రపోయాను. ఎందుకు పోయానో నాకే తెలియదు" అంటే వూరుకుంటుందా? "ఈ పని అంతా ఎవరు చేస్తారనుకున్నావే. నీ తాత గాడు చేస్తాడనుకున్నావా?" అంటుంది. "ఇల్లు చూడు. యెలావుందో — ఈ పిల్లల్ని యెవరు చూస్తారనుకున్నావ్ నీ అబ్బ!" అంటుంది. "ఇలా అయితే కుదరదు. రేపటినుంచి రాకు. ఇంకొక పనిమనిషిని చూచుకుంటాం. మాకు పని మనుష్యులే దొరకరనుకున్నావా? పని మనుషులు దొరక్క నిన్ను పెట్టుకున్నాం అనుకున్నావా?" అని నానామాటలూ అంటుంది. నేను ఏమన్నా మాట్లాడకుండా వూరుకునేదాన్ని. తప్పు నాదే అనిపించేది. ఏడుగంటలకు వస్తానన్నాను. రాలేకపోయాను. ఎవర్నని ఏం ప్రయోజనం? ఏమన్నా తలవంచుకుని పని చేసుకునేదాన్ని. అది తప్పే అయ్యేది. "బెల్లం కొట్టిన రాయిల్లే పలుకవేమే!" అనేది యజమానురాలు, "దున్నపోతుమీద వాన పడ్డట్టే" అనేది. "మింగి. అన్నీ కడుపులో పెట్టుకొని చెయ్యదలచింది చేసి వూరుకుంటుంది" అనేది అననియ్ తప్పు నాది అనుకునేదాన్ని నేను కానీ క్రమక్రమేణా నా బుద్ధి మారింది .... మళ్ళీ యెదురుతిరిగి మాటలు అన బుద్ధి అయ్యేది. ఈ మార్పుకు కారణం ఏమిటో ఎందుకు వచ్చిందో నేను చెప్పలేను.



ఈ మార్పు వచ్చినప్పటినుంచీ అనేక ఆలోచనలు నాలో కదుల్లాడ మొదలు పెట్టినై. ఎక్కడ నుంచి వచ్చినయ్యో ఈ ఆలోచనలు! అంతకు ముందు ఏమైనయ్యో! పొద్దున చేసిన చిరుతిండి అయ్యకు నాతోనే పంపేది. ఆ చిరుతిండి చూస్తే నాకు తినబుద్ధి అయ్యేది మొదట్లో ఆ యింట్లో చేసుకున్న కూరలు నాకు రుచించేవిగాదు! నా పచ్చడి మెతుకులే నాకు బాగుండేవి అక్కడ అన్నం తిన్నా. ఇంటికి వెళ్ళి మళ్ళీ పచ్చడి మెతుకులు తినబుద్ధి అయ్యేది. తినేదాన్ని కూడా. ఇప్పుడు కూరల రుచి తెలిసింది. తాళింపు వేస్తుంటే నోరూరుతుంది ఒకవేళ నాకు యివన్నీ వేసి పెడతావని. నేను పనిలో చేరినప్పుడు అనకపోయినా, నా యజమానురాలికి ఈ మాత్రం దయ ఎందుకు లేదా అనిపించేది.

నేను చిన్నదాన్ని. ఇన్ని రకరకాల వంటకాలు చూస్తూ, తినేవాళ్ళకు చేరవేస్తున్నాను కదా! నాకూడా తినాలని వుంటుందని యెందుకు అనుకోదో నా యజమానురాలు! నాకు పెడితే యేం పోయిందో! పిల్లలకు పెట్టిన చిరుతిండ్లు వారు సరిగా తినవే తినరు. యిటుకెలికి, అటుకెలికి పారవేస్తారు. అవంతా యెత్తి

నేను పారవెయ్యాలి. ఆ ప్లేట్లన్నీ నేను కడగాలి. అప్పుడు నాకెట్లా వుంటుంది? మనస్సులో ద్వేషం పెరుగుతుందంటే యెందుకు పెరగదు? పారవెయ్యనన్నా పారవెయ్యొచ్చు గానీ. నాకు పెట్టకూడదు నాకూ తినాలని వుంటుందనీ. పారవేసే బదులు నాకు పెట్టవచ్చనీ నా యజమానురాలికి తట్టినట్టే కనబడదు. అసలు ఆమె నన్నుగురించి ఏమనుకుంటూ వుందో? నేను మనిషినని ఆమెకు తెలుసున్నట్లే లేదు. నేను మనిషిననే అని ఆమెను నమ్మించటం ఎట్లా?

నేనిట్లా కుళ్ళిపోతూంటే యే వంటి గంటకో పిలిచేది నా యజమానురాలు. "అన్నం తీసుకు వెళ్ళి తినవే" అని. ఏ మన్నం అది—వాళ్ళు రాత్రి తినగా మిగిలిన అన్నం! రాత్రి మిగిలిన యే పులుసో యింత వేసివుండేది! అంతకు ముందు యింట్లోవాళ్ళందరికీ, ఉప్మాలూ, ఇడ్డెన్లూ నేను చేసి వేశాను చేతితో వేయించిన యిగుర్లూ. పులుసులూ వడ్డించాను. వాళ్ళు విస్తళ్ళలో సగానికి సగం వదిలేశారు. అవన్నీ ఎత్తేశాను. తీరా ఒంటి గంటవరకూ ఆకలి ఆపుకుని అన్నం తినాలనిపించే వరకూ నిన్న రాత్రి వండిన అన్నం! అందరూ తినగా మిగిలిన అన్నం! నీళ్ళు కారుతున్న అన్నం! ఆ అన్నం చూడగానే కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగేవి. పోనీ ఈ అన్నమే నేను రాగానే పెడితే. నా యజమానురాలికి పోయేది ఏముంది? వాళ్ళు ఒకసారి చిరుతిండి తిని. మళ్ళీ అన్నాలు ముగించుకుని అప్పుడా ఈ అన్నం నాకు పెట్టేది? ముందుగానే పెడితే, ఆవిడకుపోయేది ఏముంది? కానీ పెట్టదు. ఒకవేళ వాళ్ళు ముందుగా భోజనాలు ముగించుకున్నా. నేనీ అన్నం కోసం ఒంటిగంటదాకా ఉండవలసిందే. అంతగా కాలం గడవకపోతే ఆవిడ వొక్క గుక్కెడు నిద్రపోయి వస్తుంది. ఎందుకిట్లా చెయ్యటం?

నేను ఉండబట్టలేక. ఒకరోజు నా యజమానురాలిని అడిగాను: "ఆకలి అవుతూ వుంది. ముందుగా అన్నం పెట్టమని ఈ మాటకు ఆమె ఇంతఎత్తున లేచి. "ఎంతపొగరే నీకు? నేను తినకముందు నీకు పెట్టాలా? ఇంట్లో తిని బలిసి వొంటికి కావరం పట్టిందే నీకు! ఇక నిన్ను వొక్క క్షణం వుంచుకోను. పో యిక్కడనుంచి" అని ఇంట్లోంచి తరిమి వేసింది.

నేను కాళ్ళీడ్చుకుంటూ నా గుడిసెకు వెళ్ళాను. ఎక్కడనించి వచ్చిందో నిద్దుర: నేలమీదపడి మొద్దు నిద్దురపోయాను. రాత్రి ఎప్పుడో మా అమ్మవచ్చి లేపింది. నేను జరిగినదంతా చెప్పాను. మా అమ్మకు యెక్కడలేని కోపం వచ్చింది. "ఓసి నీ తాడు తెగ! వాళ్ళు యెప్పుడు పెడితే అప్పుడు తినక నీకేం రోగం వచ్చిందే! వాళ్ళతోపాటు పెట్టమంటావటే నీకు? నా రెక్కల కష్టం నాకే సరి పోవటంలేదు ఇక నిన్నెక్కడ పోషించేదే నేను! చావు....చావు" అని చితక గొట్టింది కొట్టి కొట్టి తనూ అవుర్న ఏడ్చింది....నన్ను కావులించుకొని.... "దేవుడెందుకు తీసుకుపోడే మన బోటి వాళ్ళని" అని గుండె పగిలేట్టు ఏడ్చింది.